క్లుప్తంగా

విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలి



కేజీబీవీ విద్యార్థినులతో డీఈవో రాము

జగిత్యాల: విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని, ఆరోగ్యం కాపాడుకోవడం కూడా ఎంతో ముఖ్యమని డీఈవో రాము అన్నారు. శనివారం జగిత్యాల కేజీబీవీ విద్యార్థులకు హార్ట్‌ఫుల్‌నెస్ శ్రీరామచంద్రం మిషన్ ఆధ్వర్యంలో బెటర్‌మైండ్స్ ట్రైనింగ్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగా చేయాలని, మానసిక ఒత్తిళ్లు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సభ్యులు మంచాల కృష్ణ పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి



మాట్లాడుతున్న మచ్చ శంకర్

జగిత్యాల: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే నూతన పీఆర్సీని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ అన్నారు. శనివారం సంఘ భవనంలో కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 5 డీఏలను విడుదల చేసినా ప్రభుత్వం డీఏలను పెండింగ్‌లో ఉంచడం పట్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లుతుందన్నారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్, రాష్ట్ర కార్యదర్శులు రవీందర్, శివరామకృష్ణ, శ్రీనివాస్, రవి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు



బ్రేకర్ ప్రారంభిస్తున్న విద్యుత్ అధికారులు

మెట్‌పల్లిరూరల్: వేసవిలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు చేపడుతున్నామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శాలియానాయక్ అన్నారు. మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్,ఆత్మకూర్ సబ్‌స్టేషన్లలో అదనపు వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్లు,వెల్లుల సబ్‌స్టేషన్‌లో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఓవర్‌లోడ్, లోవోల్టేజ్ సమస్యలు రాకుండా ఎక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈ గంగారాం, ఏడీఈ మనోహర్, ఏఈ అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు భత్యం చెల్లించాలి

జగిత్యాల: ఎస్సెస్సీ పరీక్ష జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు భత్యం వెంటనే చెల్లించాలని శనివారం డీఈవోకు టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేశ్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా ఉపాధ్యాయులకు మూల్యాంకన భత్యం, టీఏ, డీఏలు అందడం లేదని, ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన డీఈవో రాష్ట్ర పరీక్షల విభాగం అధికారులతో మాట్లాడారు. వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటామని పరీక్ష విభాగం అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

కల్యాణ వేదికపై పునరాలోచించాలి

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కల్యాణ వేదిక స్థలంపై దేవస్థానం వారు పునరాలోచించాలని దేవస్థానం మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ధర్మపురి పట్టణంలో శనివారం మాట్లాడారు. స్వామివారి కల్యాణంపై దేవస్థానం అనాదిగా వస్తున్న శేషప్ప కళావేదికపై కాకుండా మరో చోట నిర్వహించాలని నిర్ణయించడం సరికాదన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో స్వామివారి కల్యాణం జరిపించడం ఏంటని ప్రశ్నించారు. ఏళ్లుగా వస్తున్న సాంప్రదాయాన్ని మార్చవద్దని, భగవంతుడి కార్యక్రమంపై రాజకీయాలు వద్దని, భక్తుల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నాలు చేయవద్దని కోరారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయ్యోరి రాజేష్, సంగి శేఖర్, మాజీ కౌన్సిలర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

జగిత్యాల/జగిత్యాలరూరల్/జగిత్యాల జోన్/కోరుట్ల/ధర్మపురి/రాయికల్/మెట్‌పల్లి/మల్లాపూర్/కథలాపూర్/మల్యాల/సారంగాపూర్: మహిళా దినోత్సవంను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మహిళ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మహిళా ఉద్యోగులు, టీచర్లు, మహిళా రైతులు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, మహిళా కార్మికులను సన్మానించారు. పురుషులకు దీటుగా మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు.



కోరుట్లలో ఆర్టీసీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



రాయికల్‌లో మహిళా దినోత్సవ సంబరాల్లో మహిళలు



సారంగాపూర్‌లో అంగన్‌వాడీ, ఆశా,వైద్య సిబ్బందికి సన్మానం



పోరండ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



మహిళా కార్మికులను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ గోవర్ధన్



జగిత్యాలలో మహిళలను సన్మానిస్తున్న వాకర్స్



కథలాపూర్‌లో ఉపాధికూలీలతో సంబరాలు



గుండంపల్లిలో అంగన్‌వాడీ, ఆశా, వైద్య సిబ్బందికి సన్మానం



ధర్మపురిలో అంతర్జాతీయ క్రీడాకారిణికి సన్మానం



మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

కాల్వ ఇలా.. నీరు వెళ్లేదెలా?



దోమలకుంట శివారులో డీ-73 ఎస్సారెస్పీ కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

పెగడపల్లి: ఎస్సారెస్పీ కాల్వల విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మండలంలోని దోమలకుంట, సుద్దపల్లి, బతికపల్లి, ఆరవెల్లి గ్రామాలకు సుమారు 120 ఎకరాలకు పైగా నీరందించే డీ-73 ఉప సిల్టు, ఇసుక మేటలు వేయడంతో పాటు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో నిండిపోయి నీళ్లు ముందుకు వెళ్లడం లేదు. ఈ కాలువ ఆధారంగా చాలామంది రైతులు యాసంగిలో వరి పంట సాగు చేశారు. వారబంధీ పద్ధతిన నీరు విడుదల చేస్తుండటంతో కాల్వ నిర్వహణ సక్రమంగా లేక చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలపై అధికారుల పర్యవేక్షణ లోపించి ఉప కాల్వల పరిస్థితి మరి అధ్వానంగా తయారైందని ఆరోపిస్తున్నారు. కాల్వ బాగు విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. కాలువలు కూలిపోయి పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నా అధికారులకు కనిపించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి డీ-73 కాలువను బాగు చేయించాలని కోరుతున్నారు.

మహిళలు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవాలి



మాట్లాడుతున్న వైద్యులు

జగిత్యాల: మహిళలు సర్వైకల్ క్యాన్సన్ వ్యాక్సిన్ తీసుకోవాలని స్త్రీ వైద్య నిపుణురాలు పద్మిని అన్నారు. జగిత్యాల గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్‌లో శనివారం సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో క్యాన్సర్ మరణాలు రోజురోజుకూపెరుగుతున్నాయని, ప్రతీ ఒక్కరు వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్ మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 28 మంది బాలికలు, మహిళలు వ్యాక్సిన్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌కుమార్, శ్రీలత, రజిత, నాగరత్న, మోర రోజా పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని మమతా మల్టీ స్పెషల్ హాస్పిటల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 150 మంది బాలికలకు హెచ్‌పీవీ వాక్సిన్ వేశారు. ఈ వాక్సిన్ వల్ల మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిల్లల వైద్యుడు మిట్టపెల్లి రాజేష్, పలమనాలజిస్ట్ నడికట్ల సంతోష్, గైనకాలజిస్ట్ నడికట్ల మధుశ్రీ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

శ్మశానవాటిక దారి కబ్జాపై ఫిర్యాదు

మల్యాల: మండలంలోని నూకపల్లిలో శ్మశానవాటికకు వెళ్లే దారిని గ్రామానికి చెందిన మారంపల్లి నారాయణ కబ్జా చేశాడని ప్రశ్నించినవారిని తిడుతూ, చంపుతామని బెదిరిస్తున్నాడని గ్రామస్తులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్మశానవాటికకు వెళ్లే దారిలో నారాయణ మట్టికుప్పలు పోశాడని, ఈ నెల 6న కనకట్ల భూమవ్వ మృతిచెందగా, శ్మశానవాటికకు వెళ్లేందుకు దారిలేక, మట్టికుప్పలు తొలగించి, దహన సంస్కారాలు నిర్వహించామని తెలిపారు. శ్మశాన వాటిక దారిని కబ్జా చేసిన నారాయణపై కేసు నమోదు చేయాలని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోకిరీపై కేసు నమోదు

రాయికల్: మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన భూక్య వంశీ అనే వాహనదారుడు అతివేగంగా ద్విచక్ర వాహనం నడపడంతో పాటు, అతిగా హారన్ కొట్టడంతో శనివారం ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, వేగంగా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస ఎక్స్‌ప్రెస్ ఫీడర్ పరిధిలోని పరిశ్రమలకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

మెట్లు కూల్చారు... అడ్డాగా మారింది

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కాంప్లెక్స్ రోడ్డు వైపున ఫస్ట్ ఫ్లోర్‌కు వెళ్లేందుకు మెట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల రోడ్డు వెడల్పులో భాగంగా ఆ మెట్లను కూల్చివేశారు. కూల్చివేసిన మెట్ల స్థానం వాహనాలు, తోపుడు బండ్లకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా వాటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ కాంప్లెక్స్ పక్కన వాహనాలు, తోపుడు బండ్లు

ప్రైవేట్ టీచర్లకు హెల్త్ స్కీం వర్తింపజేసేందుకు కృషి

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న హెల్త్‌స్కీంను ప్రైవేట్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింజేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాలకు వచ్చిన సందర్భంగా ఆయన రామాలయంలో పూజలు చేసి అనంతరం మాట్లాడారు. పీఆర్టీయూ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. బీఆర్.అంబేడ్కర్ శాసనమండలిలో ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, జమున, శశికళ, జయప్రధ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందన

జగిత్యాల: రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ ఇటీవల ప్రపంచంలో సైన్స్ అనే అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు జూపాక సుదర్శన్, అభయ్‌రాజ్, ముఖియోద్దీన్ ఎంపికయ్యారు. వారు రూపొందించిన పరిశోధన పత్రాలను ప్రదర్శించగా, వారిని డీఈవో రాము అభినందించారు. ఇది జిల్లాకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కామర్స్‌తో విద్యార్థులకు భవిష్యత్

జగిత్యాల: కామర్స్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య శాస్త్ర అధ్యాపకులతో కామర్స్ ఫోరం ప్రారంభించి మాట్లాడారు. కామర్స్‌తో విద్యార్థులకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయన్నారు. సైన్స్ విద్యార్థులు సైతం కామర్స్ చదవడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. హైస్కూల్ స్థాయి నుంచే నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికే ప్రతిజ్ఞ దివస్

జగిత్యాల: ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆదివారం బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ దివస్ నిర్వహిస్తున్నట్లు ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ జువ్వాజి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ ప్రతిజ్ఞ దివస్‌కు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాగుల రాజు, లింగారెడ్డి, ప్రేమ్‌కుమార్, కాయితి కిషన్ తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్: కాలువ చివరి భూములకు సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సెప్టెంబర్ వరకే కురవడంతో బావుల్లో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. దీనికి తోడు సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. మండలంలోని పోతారం గ్రామాల్లో డీ-53,12 1ఆర్ కాలువ కింద ఎస్సారెస్పీ నీరు చివరి భూములకు చేరకపోవడంతో వరి పొలాలు పొట్టదశలో ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ అధికారులు పరిస్థితిపై సమీక్షించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చక్రూనాయక్, డీఈ ఎస్సారెస్పీ సెల్ నం.: 9652638815

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

దుండగులను కఠినంగా శిక్షించాలి



మల్లాపూర్ అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మల్లాపూర్: అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు పులేరి రాము డిమాండ్ చేశారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్ యూత్ నాయకులు, దళిత యువకులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాయికల్ పట్టణంలోని కోరుట్ల క్రాసింగ్ రోడ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘ నాయకులు క్షీరాభిషేకం చేశారు. దుండగులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మల్యాల: అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీటీసీ బెజ్జంకి బుజ్జయ్య అన్నారు. శనివారం మండలంలోని తాటిపల్లిలో దళిత సంఘాల నాయకులు, చిన్న దుర్గయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.